క్లుప్తంగా

నీతికథలు నేర్చుకుందాం



పిల్లలకు నీతికథలు చెబుతున్న అనురాధ

దాబాగార్డెన్స్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు నీతికథలపై కార్యక్రమం నిర్వహించారు. ప్రథమ ఇనిస్టిట్యూట్ రీసోర్స్ పర్సన్ అనురాధ విద్యార్థులకు నీతికథలను బోధించారు. సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డి. సంజీవకుమార్ ప్రథమ చికిత్స అంటే ఏమిటి? ఎలా చేయాలో వివరించారు. విద్యార్థులతో మాట్లాడించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ అధికారి ఎల్. రాజేంద్రవర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహాంజలి సేవా సంస్థ ఆపన్నహస్తం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహాంజలి సభ్యులు

దాబాగార్డెన్స్: స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సేవా సంస్థ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొండపాలెం గ్రామానికి చెందిన మణికంట స్వామికి గురువారం ఆర్థిక సాయం అందజేసింది. మణికంత కడుపులో పేగులు దెబ్బతినడం వల్ల సర్జరీ చేయించుకున్నాడు. సమాచారం తెలుసుకున్న స్నేహాంజలి సభ్యులు రూ.13 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దొండ రమేష్ మాట్లాడుతూ సంస్థ చేసే సాయం చిన్నదైనా.. చాలా సంతృప్తినిస్తుందని, సంస్థ సేవలు నిరంతరాయంగా సాగుతాయన్నారు. కార్యక్రమంలో పీలూరు శ్రీను, కొత్తపల్లి కనకరాజు, డేనియల్, భోగేష్ తదితరులు పాల్గొన్నారు.

హాకర్స్‌కు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలి



షాపులు కోల్పోయిన హాకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

మహారాణిపేట: దేవదాయ శాఖ స్థలంలో షాపులు తొలగించడంతో ఇబ్బంది పడుతున్న హాకర్లకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం సంఘటన స్థలాన్ని ఆయన సందర్శించారు. అనంతరం దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత, టర్నర్ సత్రం ఈవో ప్రసన్నలక్ష్మి, తదితరులతో ఆయన చర్చించారు. హాకర్స్‌కు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చిటపట చినుకులు



అక్కయ్యపాలెంలో కురుస్తున్న వర్షం

సీతంపేట: మండే ఎండలతో సతమతమవుతున్న జనానికి చిటపట చినుకులు ఊరటనిచ్చాయి. అసలే రోహిణి కార్తె.. భానుడి ప్రభావంతో ఉక్కిరి బిక్కిరి నుంచి చల్లటి వానతో ఉపశమనం కలిగింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్ర ప్రభావం చూపినా.. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడి ఆహ్లాదకరంగా మారింది. ఆ తర్వాత సాయంత్రం కురిసిన వర్షానికి నగరం చల్లబడింది. జనం సేదతీరారు. అకాల వర్షంతో వాతావరణం ఒక్కసారిగా కూల్ అవ్వడంతో వేసవి తాపం నుంచి జనం ఉపశమనం పొందారు.

కల్యాణోత్సవాలకు వేళాయె

- ముస్తాబవుతున్న రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం
- విశేష పూజలు, సామూహిక వ్రతాలు, శ్రీపుష్పయాగం
- ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు



రమా సహిత సత్యనారాయణ స్వామివారు



ఇసుక కొండపై వెలసిన స్వామి ఆలయం

దాబాగార్డెన్స్ : ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వారి ఆలయం వార్షిక దివ్య కల్యాణోత్సవాలకు ముస్తాబవుతోంది. ఇందుకు సంబంధించి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 200 ఏళ్ల కిందట ఈ ఆలయాన్ని సీతారామ్ బాబాజీ అనే సాధువు (సిద్ధ పురుషుడు) నిర్మించినట్టు పూర్వీకులు చెబుతారు. 1986లో అప్పటి దేవదాయ శాఖ కమిషనర్ ఈ దేవాలయాన్ని కనకమహాలక్ష్మి దేవాలయానికి దత్తత ఇచ్చి అభివృద్ధి చేసినట్లయితే దేవాలయ విశిష్టత పెరుగుతుందని భావించారు. అమ్మవారి దేవాలయానికి దత్తత చేసి సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

30 నుంచి దివ్య కల్యాణోత్సవాలు

ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5 వరకు దివ్య కల్యాణోత్సవాలు జరపనున్నారు. 30 సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కల్యాణోత్సవాలు ప్రారంభించనున్నారు. అనంతరం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తుయోగీశ్వర మండలారాధన, అగ్ని ప్రతిష్ఠాపన హోమాలు నిర్వహించనున్నారు. 31 ఉదయం 6 గంటలకు నిత్యహోమం, వైనతేయ ప్రతిష్ఠ, ధ్వజారోహణం నిర్వహించనున్నారు. 8 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరపనున్నారు. సాయంత్రం 7 గంటలకు స్వామి వారి దివ్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. జూన్ ఒకటో తేదీ ఉదయం 8 గంటలకు నిత్య హోమం, విశేష హోమాలు, సాయంత్రం 6 గంటలకు నిత్యపూజలు, హోమాలు జరపనున్నారు. 2వ తేదీ ఉదయం 8 గంటలకు నిత్య కార్యక్రమాలు, అనంతరం విశేష హోమాలు, సాయంత్రం 7 గంటలకు ×వైదిక సదస్యం౯మహదాశీర్వచన కార్యక్రమం (పండిత సత్కారం) చేపట్టనున్నారు. 3 ఉదయం 8 గంటలకు యాగశాలార్చన, నిత్య పూజలు, విశేష హోమాలు, సాయంత్రం 6 గంటలకు విశేష హోమాలు, 7 గంటలకు దీపోత్సవం (తిరుమంగయాళ్వారు కైంకర్యం), 4న జ్యేష్ఠపౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం 7 గంటల నుంచి సత్యనారాయణస్వామి విశేష వ్రతాలు, మధ్యాహ్నం 12 గంటలకు విశేష హోమాలు, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం అవభృదం, చక్రస్నానం, 5వ తేదీ సాయంత్రం 7 గంటలకు సప్తావరణోత్సవం, ద్వాదశారాధనలు, శ్రీపుష్పయాగం, పవళింపు సేవ నిర్వహించనున్నారు.

31న స్వామి కల్యాణం..

31న స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మహోత్సవంలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

ఆలయంలో రోజువారీ పూజలు ఇలా..

ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు, పౌర్ణమిరోజు ఉదయం 5 నుంచి 11 గంటల వరకు నిరంతరాయంగా స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించనున్నారు. పూజా రుసుం రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

ధ్వజస్తంభ పూజ, విశేష దర్శనం..

ధ్వజస్తంభ పూజ, విశేష దర్శనం చేయించుకోదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. పౌర్ణమి రోజున ప్రత్యేకంగా ధ్వజస్తంభ ప్రదక్షిణ ఉంటుంది. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు, పౌర్ణమి రోజు ఉదయం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆలయం నిరంతరాయంగా తెరిచి ఉంటుంది. మహానివేదన ఉదయం 11.40 నుంచి 12 గంటల వరకు.

ఎమ్మెల్యే ఔదార్యం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డు ప్రకాశరావుపేటకు చెందిన కాళ్ల అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. భార్య స్వాతి దశదిన కర్మ నిర్వహించేందుకు ఆర్థిక సాయం చేయాలని కోరిన మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. అంతేగాక స్వాతికి ఉద్యోగం, పదవ తరగతి చదువుతున్న ఆమె కుమార్తెను ఎమ్మెల్యే కళాశాలలో ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. ఆంథోనీనగర్‌కు చెందిన కోట సరస్వతి ఇటీవల మృతి చెందారు. దశదిన కర్మ నిర్వహించేందుకు ఆమె కుమార్తె దేవి విజ్ఞప్తి మేరకు రూ.5 వేలు అందజేశారు. అలాగే దొండపర్తికి చెందిన ఓదూరు ప్రవీణ్‌కుమార్ పేగు సమస్యతో బాధపడుతున్న దృష్ట్యా రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పీతల వాసు, నీలాపు సర్వేశ్వరరెడ్డి, నీలాపు లక్ష్మీ, బెవర మహేష్, కోరాడ సురేష్, ఆరుగు రాజు, అడపా శివ, కనకల రాజు, గండి అప్పలరాజు, బుల్లెట్ రవి, కొల్లి రామకృష్ణ, ఉమా మహేష్, మాణిక్యం శ్రీను, అజయ్‌రెడ్డి, మధు, అనిల్, జగన్మోహన్, తాతబాబు, సచివాలయ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వివేకానంద సంస్థ ఉపాధ్యక్షుడికి ఘన నివాళి

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు దూడ రాజు సంతాప సభ గురువారం సంస్థ ప్రాంగణంలో నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు పేరిట పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు సంస్థ నిర్వహించిన అన్ని కార్యక్రమాల్లో తోడుగా ఉంటూ అందరి మన్ననలు రాజు పొందారని కొనియాడారు. గొప్ప వ్యక్తిని కోల్పోవడం సంస్థకు తీరని నష్టంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సీనియర్ పాత్రికేయుడు వీవీ రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, సూరాడ అప్పారావు, వాసుపల్లి కోదండరావు, చింతపల్లి పోతురాజు, గజపతి స్వామి, మక్సూద్ అహ్మద్, సాయి బలరాం, యాసీన్‌బాబ్జి, ముజీబ్‌ఖాన్ పలువురు ప్రముఖులు, దూడ రాజు కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



అష్టోత్తర కలశ పూజ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



కలశాలతో మహిళలు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మశాస్త (అయ్యప్పస్వామి) దేవాలయం 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం మహా కుంభాభిషేకం వైభవంగా ప్రారంభమయింది. ఉదయం నుంచి దేవాలయంలో పూజలు, జలాభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని స్వయంగా అయ్యప్పస్వామికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన శోభాయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం టీటీడీ అధర్వణ వేద పండితులు అక్కాజోష్యుల రమేశ శర్మ ఆధ్వర్యంలో అష్టోత్తర కలశములకు అభిమంత్రం, అగ్నిమథనం, మూలమంత్ర హవనం, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో రమాబాయి, గురుస్వామి నీలాపు రమణారెడ్డి, ఎల్.సుకుమార్, చంద్రరావు, సోమశేఖర్, ఆనందరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, లక్ష్మణరావు, నీలకంఠం, రవిబాబు, పాల శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ.. కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

అల్లిపురం: కుమారుడు మరణించాడని మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దండుబజార్ ప్రాంతం ఎస్ఎస్ ప్లాజాలో గ్రంధి కృష్ణారావు తన కుటుంబంతో కలసి నివసిస్తున్నాడు. కొద్ది కాలం క్రితం అతని కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మనస్తాపంతో కృష్ణారావు భార్య పార్వతి అనారోగ్యం పాలైంది. కుమారుడి కోసం దిగులుగా ఉన్న ఆమె బుధవారం రాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కృష్ణారావు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ పి.లక్ష్మి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాసేవలో వలంటీర్ల పాత్ర కీలకం



సేవా వజ్ర, సేవారత్నలతో వలంటీర్లు

దాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ తెలిపారు. వార్డు పరిధి అంబేడ్కర్ కల్యాణ మండపంలో గురువారం వార్డు పరిధిలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న చెన్నా మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తూ, వారి అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించేలా నిరుద్యోగ యువతను భాగస్వామ్యం చేస్తూ సచివాలయ/వలంటీర్ వ్యవస్థను స్థాపించారన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, పార్టీ నాయకులు ఆకుల యేసు, డేవిడ్ రాజు, సత్యవతి, కాసారపు వాసు, నిమ్మకాయల ఆది లక్ష్మి, చెన్నా శైలజ, సారిక దైవకుమార్, డాక్టర్ రమణ, ఆనంద్, శేఖర్, రోజా, రమణి, ఆర్పీలు వసుంధర, గుర్ర లక్ష్మి, పార్వతి, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అక్రమ కేసుల నమోదు తగదు

సీతమ్మధార : కాంట్రాక్ట్ వర్కర్స్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ గంగారావు డిమాండ్ చేశారు. వెంకటరెడ్డిపై అసత్య ఆరోపణలు, అక్రమ బైండోవర్‌కు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్లు, పార్కులు, వెటర్నరీ, వాటర్ సప్లై తదితర విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పోరాడుతుంటే జీవీఎంసీ అధికారులు, పోలీసులు ఎన్నడూ లేని విధంగా అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు, బైండోవర్ కేసులు పెట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.వెంకటరెడ్డి, టి.నూకరాజు, యు.రాజు, ఎంవీ ప్రసాద్‌రావు, వి.కృష్ణారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం : పిఠాపురం కాలనీలోని జన శిక్షణా సంస్థాన్‌లో పలు ఉపాధి కోర్సుల్లో శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ డైరెక్టర్ చొక్కాల అప్పలనాయుడు తెలిపారు. స్వల్పకాలిక కోర్సులు పూర్తి చేసి ఉపాధి పొందవచ్చునని పేర్కొన్నారు. మూడు నెలల బ్యూటీషియన్, టైలరింగ్, ఆరు నెలల ప్రీస్కూల్ టీచర్ ట్రైనింగ్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. 45 రోజుల పాటు కంప్యూటర్, డీటీపీ, ఎంఎస్ ఆఫీస్ కోర్సులకు వేర్వేరుగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. 30 రోజుల కోర్సు అయిన ఫొటోషాప్, 45 రోజుల పాటు టాలీ కోర్సులకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 85000 54456 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

దాబాగార్డెన్స్: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో స్పాట్ బిల్లింగ్ పనులు చేస్తున్న మీటర్ రీడర్ల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. శివారెడ్డి, యూనియన్ ప్రతినిధి జీఎస్ రాజేశ్వరరావు ఏపీఈపీడీసీఎల్ సీఎండీని కోరారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐదు జిల్లాల మీటర్ రీడర్ల సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. పనిదినాల కుదింపు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని, పీస్ రేటు రద్దు చేసి నెలవారీ వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మీటర్ రీడర్స్ పీస్‌రేటును సర్వీస్‌కు రూ.9.50 పైసలుగా నిర్ణయించాలన్నారు. డోర్ లాక్, నిల్ సర్వీసులకు శాశ్వత పరిష్కారం చూపేవరకు జీతాల్లో కోతలు విధించరాదని, అలాగే ఇప్పటి వరకు జీతాల్లో అన్యాయంగా విధించిన కోతలు వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని, స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్లకు సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, జీఎస్ రాజేశ్వరరావు, కేఎస్‌డీ ఎస్‌కే రెడ్డి, రామకృష్ణ, కుమారస్వామి, శ్రీనివాస్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్ పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన సప్లిమెంటరీ ఇంటర్మీడియట్ పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 288 మంది హాజరు కావాల్సి ఉండగా.. నలుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 8 మంది హాజరు కావాల్సి ఉండగా.. ఒక విద్యార్థి గైర్హాజరు కావడంతో ఏడుగురు పరీక్ష రాశారని ఆమె తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామ పూజ జరిపారు. విశేషంగా హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంచేయజేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందించారు.

ఆటో డ్రైవర్లపై జరిమానాలు తగదు



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

ఆరిలోవ: ఆటో డ్రైవర్లపై నిబంధనల పేరిట ఆర్టీవో అధికారులు భరించలేని జరిమానాలు విధిస్తున్నారని, ఇది తగదని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. ఆరిలోవ జోన్ సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఆర్టీవో అధికారులు ఆటోలపై అక్రమ దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రూ.5 వేలు నుంచి 25 వేలు వరకు జరిమానా విధిస్తున్నారని, వెంటనే ఈ దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆర్టీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు ఆటో స్టాండ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు సత్తిబాబు, సూరిబాబు, రమణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురంలో 'బడి పిలుస్తోంది'

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో గురువారం 'బడి పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి అంటూ కార్పొరేటర్ కెల్ల సునీత గ్రామస్తులను కోరారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, పాఠశాల కమిటీ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. బడి పిలుస్తోంది అంటూ ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. బడిఈడు పిల్లలున్న తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిస్తున్న సౌకర్యాలు గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు ఉండదని, ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తారని, యూనిఫారం, బ్యాగు, షూలు, పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నారని ఆమె తెలిపారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించి అమ్మఒడి రూపంలో తల్లుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ చేస్తారన్నారు. విశాలమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, ఆట స్థలాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమ్మరాజు, గ్రామ అధ్యక్షుడు వంకర బాబూరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

29న పర్యావరణ దినోత్సవ పోటీలు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోటీలను జయప్రదం చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ టీం సంయుక్తంగా పిలుపునిచ్చాయి. ఈ నెల 29న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో డ్రాయింగ్, వ్యాస రచన, ఎలక్యూషన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. 'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై పోటీలు జరుగుతాయన్నారు. చిత్రలేఖనంలో పాల్గొనే వారికి డ్రాయింగ్ షీట్, వ్యాసరచన పోటీలో పాల్గొనే వారికి తెల్లకాగితాలు తామే ఇస్తామన్నారు. వివరాలకు 70327 81461, 83338 49955 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చకుడు వంశీ భక్తుల నామగోత్రాలతో పూజలు నిర్వహించి బాబాకు హారతి సమర్పించారు. ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం రాజాస్వామి మాట్లాడుతూ జూన్ 1న త్రయోదశి సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు రామలింగేశ్వర స్వామికి ప్రదోషకాల అభిషేకం, 4న అమ్మవారికి పౌర్ణమి పూజలు, 7న సాయంత్రం 5.30 గంటలకు మహాగణపతికి సంకష్టహర చతుర్థి అభిషేకాలు, 11న సాయంత్రం 5.30 గంటలకు కాలభైరవ స్వామికి అష్టమి అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రార్‌తో మర్యాద పూర్వక భేటీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో వైఎస్సార్‌సీపీ అనుబంధ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి గురువారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆమె ప్రశంసించారు. ఇటీవల ఏయూ నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమం నూతన సంప్రదాయానికి నాంది పలికిందన్నారు.